ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉపాధి ఊసు గాలికి..

◆ స్థలాలు అమ్ముకొనే పనిలో బ్రాండిక్స్ యాజమాన్యం
◆ తగ్గిన బిఐఎసి బ్రాండ్ ◆ అధిస్తాన్ పేరిట తెరమీదకు..

బ్రాండిక్స్ కంపెనీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఎగుమతి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి 60 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నుంచి ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు పొందిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) ఉపాధి ఊసు వదిలేసి లాభసాటి వ్యాపారంలో పడింది. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించిన భూమిపై పెత్తనాన్ని డెవలపర్ అవతారమెత్తిన బ్రాండిక్స్‌కు నాడు అప్పగించింది. 2006లో ప్రారంభమైన బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆశించిన పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి రాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటి ఎపిఐఐసి సమాచారం ప్రకారం రూ.1132 కోట్ల పెట్టుబడితో వచ్చిన 17 యూనిట్లలో 20.493 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అందులో శ్వేత ఎక్స్‌పోర్ట్సు కొద్దికాలం క్రితం మూతపడింది. మిగిలిన వాటిలో శ్రీలంకకు చెందిన తొమ్మిది, హాంకాంగ్‌కు చెందిన ఒకటి, చైనాకు చెందిన రెండు, యుఎస్ఎకు చెందినవి రెండు, ఇండియాకు చెందిన మూడు యూనిట్లు ఉన్నాయి. బ్రాండిక్స్‌కు చెందిన వస్త్ర పరిశ్రమలు మూడు వున్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించలేకపోయిన బ్రాండిక్స్ నుంచి ప్రభుత్వం భూమి తీసుకొని పరిశ్రమలను ఆకర్షించే పనిచేయలేదు. కారుచౌకగా వచ్చిన వెయ్యి ఎకరాలపై పెత్తనం పోకుండా అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా పేరుమార్చి బ్రాండిక్స్ నేడు కొత్త అవతారమెత్తింది. పేరు మార్పుపై పారిశ్రామిక చట్టంలోవున్న అంశాలను ఉపయోగించుకొని లబ్ధిపొందాలని చూస్తోంది తప్ప పేరు మార్పు విషయమై తొలుత సంబంధిత ప్రభుత్వ శాఖలకు కూడా కనీస సమాచారం ఇవ్వలేదు. బ్రాండిక్స్ పేరును అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చుకున్న తరువాత ఇకపై ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ అధిస్తాన్ కింద ఇవ్వాలని మాత్రం తాజాగా సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వస్త్ర పరిశ్రమల కంటే దేశీయ మార్కెట్ కలిగిన కంపెనీలకు స్థలాలను విక్రయించి లాభాలు పోగేసుకోవాలని చూస్తోంది. అందుకే బ్రాండిక్స్ పేరును అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చినట్టు తెలుస్తోంది. బ్రాండిక్స్ పేరుతో మార్కెట్ చేసుకోలేమని గుర్తించి, ఇకపై దేశీయ పరిశ్రమలను ఆకర్షించి స్థలాలు అమ్ముకోవాలని ప్రయత్నిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తమ పలుకుబడిని ఉపయోగించుకొని తమకు నచ్చిన రీతిలో బ్రాండిక్స్ యాజమాన్యం వ్యవహరిస్తోంది. కార్మికులకు కనీస వేతనాలు అమలుకాకపోయినా, మిగతా 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

ఉత్తరాంధ్ర పోరాటాల స్ఫూర్తితో..

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

ఉక్కు పరిరక్షణ దీక్షల్లో వక్తలు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారమూ ఉక్కు పరిరక్షణ దీక్షలు కొనసాగాయి. విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన దీక్షల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ శాసనమండలి సభ్యులు ఎంవిఎస్.శర్మ, అనకాపల్లి పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో జరిగిన దీక్షల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర పోరాటాల స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని వారు అన్నారు. రానున్న కాలంలో పోరాటాలు మరింత ఉధృతం కానున్నాయన్నారు.

(వార్తలు 8లో..)

రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
▶ వార్త 2లో..

బూసి వెంకటస్వామికి కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం
▶ వార్త 2లో..

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా
▶ వార్త 4లో..

విశాఖలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద టెట్ అభ్యర్థులు

టెట్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

ఎపి టెట్ -2024 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. విశాఖ నగరంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఉండగా జివిఎంసి పరిధిలోని అనకాపల్లిలో మరొక కేంద్రం ఉంది. మొత్తం ఎనిమిది కేంద్రాలలో ఈ పరీక్షలు ప్రశాంత

తొలి రోజు ప్రశాంతం

వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాలకు ప్రత్యేక అధికారులను, స్క్వాడ్ బృందాలను నియమించారు. ఈ పరీక్షకు 60,574 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా అందుకు మిగతా 2లో..

ముదురుతున్న పోర్టు ఆసుపత్రి ప్రైవేటు వ్యవహారం

పిపిపిపై వెనక్కి మళ్లేందుకు మొండికేస్తున్న యాజమాన్యం - హాస్పిటల్ పరిరక్షణకు ఉధృతమవుతున్న పోరాటం

-ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రైవేటీకరణ వ్యవహారాన్ని పోర్టు యాజమాన్యం ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రైవేటుపరమైతే నష్టపోతామంటూ పెన్షనర్లు, ఉద్యోగుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సుమారు 30 వేల మంది పోర్టు, డాక్ కార్మికులు, రిటైర్మెంట్ అయిన ఉద్యోగ, అధికారులూ వైద్యానికి నోచుకోకుండా పోతారన్న ఆందోళన నెలకొనడంతో ప్రైవేటు నిర్ణయం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పిపిపిలో దీన్ని ఇచ్చేస్తే సొంతం చేసుకున్న సంస్థ/వ్యక్తి క్రమంగా ఉల్లంఘనలకు పాల్పడే అవకాశాలున్నాయంటూ పోర్టులో పనిచేస్తున్న వేల మంది కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తొలి నుంచీ పిపిపి విధానంపై పోరాడుతున్న సిఐటియు ప్రైవేటీకరణకు పిలిచిన టెండర్లను రద్దు చేయాలని, పోర్టు ఆధ్వర్యానే ఆసుపత్రి కొనసాగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 1 నుంచి రిలే నిరాహార దీక్షలకు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విశాఖలోని పోర్టు ఆసుపత్రి ఎదురుగా దీక్షలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా సెప్టెంబర్ 24న పోర్టు యాజమాన్యం ఈ ఆసుపత్రిని మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చుతూ పిలిచిన టెండర్లపై పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ అంగముత్తు వెనక్కు తగ్గడం లేదు. గురువారం ఉదయం రెండు యూనియన్‌లైన యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విఎల్‌డిబి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు విఎస్.పద్మనాభరాజు, సత్యనారాయణ, జెఎస్.నారాయణ నేతృత్వంలో ఆసుపత్రి విషయమై అంగముత్తుకు మెమోరాండం సమర్పించగా ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడుతామని ఆయన మిగతా 2లో..

పోర్టు ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మనాభరాజు తదితరులు

మొదటి పేజీ తరువాయి..

ముదురుతున్న పోర్టు ఆసుపత్రి ప్రైవేటు వ్యవహారం

హామీ ఇచ్చారు తప్పితే పిపిపి విధానం నుంచి వెనక్కి వెళ్లే అవకాశంపై నోరు మెదపలేదు.

40 ఏళ్ల క్రితమే 150 పడకల సామర్ధ్యంగల ఆసుపత్రి ఇది

వైజాగ్ పోర్టు ఏర్పాటుకు 90 ఏళ్ల చరిత్ర ఉండగా, పోర్టు ఆసుపత్రి నిర్మాణం చేసి 40 ఏళ్లు కావస్తోంది. విశాఖ నగరంలోని శాలిగ్రాంపురంలో వైజాగ్ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల వైద్యం కోసం 150 పడకల సామర్థ్యంతో 1984లోనే నిర్మాణం చేశారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్ధవంతంగా నడుస్తోంది. ఇక పోర్టు ప్రగతిని పరిశీలిస్తే 1984 నాటికి 30 మిలియన్ టన్నుల కెపాసిటీగల పోర్టు 2023-24 సంవత్సరంలో 81.09 మిలియన్ టన్నులు సాధించి నెంబర్ వన్‌గా నిలిచింది. సుమారు రూ.380 కోట్లు ఈ హేండ్లింగ్ విలువ ఉంటుంది. 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ టన్నులకు వెళ్లేందుకు కృషి చేస్తోంది. పోర్టును ఈ స్థానంలో నిలబెట్టేందుకు 40 ఏళ్లుగా రాత్రనకా, పగలనకా పోర్టు ఉద్యోగులు, కార్మికులు, అధికారులు కీలకంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రూ.వందల కోట్ల పోర్టు ఆస్తిని పిపిపి పేర ప్రైవేట్ కార్పొరేట్లకు ఫలహారంగా ఇచ్చేస్తే తమ ఆరోగ్య భద్రత ఏమిటి ? అంటూ 30 వేల మంది పోర్టు ఉద్యోగ, కార్మిక, విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

తగ్గట్టు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వచ్చిన అభ్యర్థులు తమ ఫొటోతో కూడిన గుర్తింపు కార్డును, లేటెస్ట్ ఫొటోలను చూపిస్తే లోపలకు అనుమతించారు. బాలింతలు, వికలాంగులకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. హాల్ టిక్కెట్ల జారీలో జరిగిన కొన్ని లోపాల వల్ల కొంతమంది అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యారు. పలువురు అభ్యర్థులు స్కూలు అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించే క్రమంలో వేర్వేరు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. అయితే వారికి ఒకేరోజు రెండు పరీక్షల హాల్ టికెట్లు జారీ చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల ఒక పరీక్షకు మాత్రమే హాజరయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం మొదటి సెషన్ పరీక్ష ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై 12:30 గంటల వరకు జరిగింది. రెండవ పరీక్ష మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. 7, 8, 9, 10 తేదీలలో పరీక్షలు జరుగుతాయి. 11, 12 తేదీలలో దసరా సెలవులు. 13 నుంచి వరుసగా ఈ నెల 21 వరకు పరీక్షలు ఉంటాయని అధికారులు తెలిపారు.

రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 90 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాలు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా చేపట్టిన చర్యలపై సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో కలిపి రోజుకు 700 స్టేజ్ కన్వెర్షన్ జరగాలని, 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఇఇ రమణ మూర్తి, డిఇలు, మండల ప్రత్యేక అధికారులు, ఎఇలు పాల్గొన్నారు.

దిబ్రూగఢ్ - హుబ్లి మధ్య వన్ వే స్పెషల్ ట్రైన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించే క్రమంలో దిబ్రూగఢ్ - హుబ్లి మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 05926 దిబ్రూగఢ్- హుబ్లి వన్ వే స్పెషల్ ట్రైన్ అక్టోబర్ 5 శనివారం మధ్యాహ్నం 13:30 గంటలకు దిబ్రూగఢ్ నుంచి బయలుదేరి మూడో రోజు (సోమవారం) మధ్యాహ్నం 15:08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15:10 గంటలకు బయలుదేరి, నాలుగో రోజు మంగళవారం ఉదయం 9:00 గంటలకు హుబ్లి చేరుకుంటుంది. ఈ రైలు వాల్తేరు డివిజన్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస, దువ్వాడల్లో ఆగుతుందని అధికారులు తెలిపారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సైకియాట్రిక్ సొసైటీ, గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ కేర్ సంయుక్తంగా మానసిక ఆరోగ్య వారోత్సవాలను అక్టోబర్ 4 నుండి 10 వరకు ప్రభుత్వ మానసిక వైద్య శాల వేదికగా నిర్వహించనున్నాయని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్య శాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అక్టోబర్ 10ని పురస్కరించుకుని దానికి ముందు ఏడు రోజులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. 'ఇప్పుడు పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం వచ్చింది' నినాదంతో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.విజయలక్ష్మి, మాట్లాడుతూ 4వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమం, 5న పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ క్విజ్, 7న విద్యార్థుల్లో ఒత్తిడి నివారణ, 8న రోగుల సంరక్షకులు, పారా మెడికల్ సిబ్బందికి మానసిక ఆరోగ్య చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10వ తేదీన జిల్లా న్యాయ సేవల కార్యక్రమం ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి ఊసు గాలికి..

(మొదటి పేజీ తరువాయి..) ఉద్యోగ భద్రత లేకపోయినా సదరు కంపెనీపై ప్రభుత్వం కనీస జోక్యం చేసుకోవడంలేదు.

బ్రాండిక్స్ అపెరల్ సిటీలోని యూనిట్లు, ఉత్పత్తి, పెట్టుబడి వివరాలు

కంపెనీ	దేశం	ఉత్పత్తి	ఉపాధి	పెట్టుబడి (కోట్లలో)
బ్రాండిక్స్ అపెరల్ ఇండియా యూనిట్-1	శ్రీలంక	ఇన్నర్‌వేర్	4373	118.91
బ్రాండిక్స్ అపెరల్ ఇండియా -2	శ్రీలంక	ఇన్నర్‌వేర్	4869	123.76
బ్రాండిక్స్ అపెరల్ ఇండియా -3	శ్రీలంక	ఇన్నర్‌వేర్	2814	69.83
క్వాంటమ్ క్లాతింగ్	శ్రీలంక	ఇన్నర్‌వేర్	2671	30.75
బ్రాండిక్స్ ఇంటిమేట్	శ్రీలంక	ఇన్నర్‌వేర్	2811	85.32
తీజయ్ ఇండియా	శ్రీలంక	ఫ్యాబ్రిక్	1799	473.39
షోర్ టు షోర్	శ్రీలంక	ట్యాగ్స్, ఫ్యాబ్రిక్స్ లేబుల్స్	76	6.04
ఇంటర్నల్ ట్రిమ్మింగ్	శ్రీలంక	ఫ్యాబ్రిక్స్ లేబుల్స్	73	11.01
ఎకొనోప్యాక్	శ్రీలంక	కార్టన్స్	97	10.18
పయనీర్ ఎలస్టిక్	హాంకాంగ్	ఓవోన్ ఎలస్టిక్	378	85.61
తైన్యూస్ గార్మెంట్స్	చైనా	అపెరల్ షర్ట్స్, ప్యాంట్స్	7	30.48
రైబస్ట్ రైబాన్స్	చైనా	రిబ్బన్ బౌస్	247	36.09
ఎస్అండ్ఎస్ గార్మెంట్స్-1	యుఎస్ఎ	అండర్‌వైర్స్	143	13.89
ఎస్అండ్ఎస్ గార్మెంట్స్-2	యుఎస్ఎ	అండర్‌వైర్స్	79	10.12
వర్ధమాన్ యార్న్స్	ఇండియా	త్రెడ్స్	50	6.30
కెఎస్ఆర్ ఫ్రైట్	ఇండియా	వేర్ హౌసింగ్ సర్వీసెస్	5	0.07
శ్వేత ఎక్స్‌పోర్ట్స్	ఇండియా	బటన్స్	1	20.35 (మూత)

బూసి వెంకటస్వామికి కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామిని 2024 సంవత్సరానికిగాను డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఎస్‌పిఎల్‌టిఏ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిలో తనను ఎంపిక చేయటం ఆనందంగా ఉందని, తెలుగు భాష, సాహిత్యాలలో కృషి చేస్తున్నందుకుగాను ఈ సత్కారం అందుకోన్నానని వెంకటస్వామి మీడియాకు తెలియజేశారు.

ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, 15వ తేదీన భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ కింగ్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్‌ల జయంతులను పురస్కరించుకుని 20వ తేదీన గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. డాక్టర్ బూసి వెంకటస్వామి ఇప్పటికే దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా స్మారక పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం, సిరి మంజిరి జాతీయ పురస్కారం, గురుబ్రహ్మ, ఆచార్య దేవోభవ అవార్డులతో పాటు ఈ సంవత్సరం మద్రాస్ విశ్వవిద్యాలయ ఉగాది పురస్కారం, 2015లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులను దక్కించుకున్నారు. ఆయన పర్యవేక్షణలో ఇప్పటికే 12 మంది పిహెచ్‌డి అవార్డులు అందుకున్నారు.

NO.3.Order 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE JUNIOUR DIVISION AT GAJAPATHINAGARAM
O.S.124/2023

Between
Gorle Venkata Ramana. ......Plaintiff.
And:
Kilaparthi Krishna Venkata Rajesh...Defendant.
To,
Kilaparthi Krishna Venkata Rajesh, S/o Krishna, 40 years, Hindu, Businessess, Vidyalaya Upper Primary School, Sector-9, Door No. 2-15-25/2, Near D.R.D.A. Office, Ward No.7, M.V.P Colony, Vishakhaptnam-17.

Whereas you the plaintiff has instituted a suit against you for recovery of suit amount, you are hereby summoned to appear in this court in person on the **16th day of October 2024 at 10-30 (a.m.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a written statement of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before men- tioned, the suit will be heard and determined in your absence.

Reddy. Srinivasa Naidu,
Advocate,
Gajapthinagaram.
Gajapathinagaram,
Date: 03-10-2024

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: GAJUWAKA
I.P. 14/2023

Between:
Sri Boddeda Laxmana Rao, S/o. Late Ramana, Hindu, aged 52 years, R/at D.No.6-40-7/2, Drivers Colony, Gajuwaka, Visakhapatnam and Presently R/at Simhagiri Hospital, New Gajuwaka, Visakhapatnam-530026 ...**Petitioner**
And
R-1:Sri Velluri Reddamma Naidu, S/o. Raghava Jaganadham Naidu, Hindu, aged 65 years, R/at Gavarapalem, Anakapalli, V.J. Naidu Gaari Steet, Anakapalli, Visakhapatnam
R-2:Sri Yellapu Raju, S/o. not known, Hindu, aged about 52 years, R/at D.No.31-30-52, Narayana Road, Milk Booth, Allipuram, Visakhapatnam.
R-3:Smt. Sadaram Padmalatha, W/o. Srinivasa Rao,Hindu, aged about 42 years, R/at Near Ramalayam, Marripalem, Visakhapatnam.
R-4: To **the Branch Manager, IDBI Bank,** D.No.6-60-24, Jaya Surya Complex, Chronic Nagar, Gajuwaka, Visakhapatnam.
...**Respondents**

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P.14/2023 on the file of the Hon'ble Principal Senior Civil Judge Court at Gajuwaka to declare him as an insolvent and the matter stands posted to **21-10-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the above mentioned Hon'ble Court on **21-10-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)
Y. NARASINGA RAO YADAV,
Advocate, Gajuwaka,
Visakhapatnam, Cell: 9014445077

నగర పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్వీర్యం చేసేలా, ఆయా డ్రగ్స్ రాకెట్లపై ఉక్కుపాదం మోపేలా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి ప్రతిష్టాత్మక న్యూఢిల్లీ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులతో నగర పోలీసులకు గురువారం ఎన్‌డిపిఎస్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోకు చెందిన నలుగురు అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణపై సంతృప్తి వ్యక్తమైంది.

IN THE HON'BLE COURT OF THE IX ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: CHODAVARAM
M.O.P.445/2023

Between:
Sri Anupoju Kanaka Rao ...Petitioner
And:
Sri Valisetti Suresh & 2 others ...Respondents

NOTICE

To,
Respondent No.1:
Sri Valisetti Suresh,
S/o. Ramu, Hindu, aged 40 years, R/at D.No. 6-14-3, Drivers Colony, Old Gajuwaka, Visakhapatnam, (Driver of Ashok Lelyland, Lorry Goods Carriage bearing Reg.No. AP39 UF-7979)

Please take notice that the above named petitioner has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **14-10-2024** for your appearance before the Hon'ble Court either in person or through Advocate on **14-10-2024** at **10:30 A.M**. in the above Court, failing which the Hon'ble Court is decided under the Court of law.

(By Order of the Hon'ble Court)
VANTAKU APPA RAO,
Advocate
Gajuwaka,Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.74/2022

Between:
INDIAN BANK, Seethammapeta Branch, Visakhapatnam, Rep., by its Branch Manager ... Plaintiff
And:
Sri Upadhyula Phani Kumar ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Upadhyula Phani Kumar, S/o. not known, Hindu, age not known but major, R/at D.No.12-10-25, Vedulavari Street, Anakapalle-531 001 and also C/o. S. Sreenu Babu, D.No.22-73-26/4, Near Town Hall Road, Seetharamaswamy Temple Street, Visakhapatnam-01.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **06-11-2024** for your appearance on that day **10:30 A.M.**, you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte.

(By Order of the Hon'ble Court)
G. LAKSHMI RAMBABU,
S. VARALAKSHMI
Advocates, Visakhapatnam

మహారాజశ్రీ గౌరవ ఫ్యామిలీ కమ్ VIIIవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఒంగోలు.
FCOP NO.153/2023

సుధీర్ కుమార్ పుట్టా Vrs మేడికొండ హనీష
టు:
రెస్పాండెంటు:
మేడికొండ హనీష W/o **సుధీర్ కుమార్ పుట్టా,** D/o మేడికొండ శ్రీధర్, వయస్సు 30 సం॥లు, హిందూ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, R/o డో.నెం.31-43-415, వుడా ఫేజ్-2, గ్లోరియా పబ్లిక్ స్కూల్ దగ్గర, కూర్మన్నపాలెం, విశాఖపట్టణం-530049.

గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికా ముఖంగా యిస్తున్న సమను నోటీసు. పై **FCOP** నందు పిటీషనరు, రెస్పాండెంటు నుండి విడాకులు కోరుతూ దాఖలు చేసియున్నారు. కాన సదరు **FCOP**లో **తే.28-10-2024న ఉ॥10-30గం॥లకు** పై పేర్కొన్న రెస్పాండెంటు, స్వయంగా గాని, ఆమె తరుపున అడ్వకేట్ ద్వారా గాని గౌరవ కోర్టు వారి ఎదుట హాజరై, ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. అట్లు కాని పక్షంలో ఆమె పరోక్షంలో కేసు విచారణ జరపబడుతుందని, పత్రికా ముఖంగాయిస్తున్న సమను నోటీసు.

K.BRAHMA REDDY
Advocate, D.No: 37-1-108 (48), 3rd Line, Bhagya Nagar, Ongole-523001, Prakasam Dist. A.P.
Cell :94404 59259

నూతన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : క్రిమినల్ లా నూతన చట్టాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా న్యాయ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలకు చెందిన అధికారి కె.సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పద్ధతి ప్రకారం చట్టాలను అర్థం చేసుకొని, అవసరమైన సమయంలో ప్రజలకు న్యాయం అందించాలని సూచించారు. స్కూల్ ఆఫ్ లా ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మణరావు మాట్లాడుతూ, న్యాయ వృత్తిలో ప్రవేశించే విద్యార్థులు వివిధ కోణాల నుంచి చట్టాలను అవగాహన చేసుకొని విశ్లేషణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస సబ్‌స్టేషన్ పరిధి 11కెవి మారికవలస ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కెవి జేక్ లే-అవుట్ ఫీడర్లపై మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ -2 డిఇ పి.శ్రీనివాసరావు, ఎఇ నరేష్ తెలిపారు. మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, బోరవానిపాలెం, మారికవలస జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, బోరవానిపాలెం, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జేక్ లే-అవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జాబ్ మేళాలో 80 మంది ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 80 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 356 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. డిప్లమా ఎలక్ట్రికల్, మెకానికల్, ఇనుస్ట్రుమెంటేషన్ అండ్ కెమికల్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, డిగ్రీ, ఎస్‌ఎస్‌సి, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.చాముండేశ్వరరావు, కళాశాల సిసిపి విభాగాధిపతి జి.రాజేశ్వరి, సిహెచ్.రాకేష్, దీపక్, ప్లేస్ మెంట్ అధికారి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లివారి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోన పైడిరాజు శ్రీను మాట్లాడుతూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పంచాయతీ అభివృద్ధికి ప్రసాద్ కృషిచేశారన్నారు. పద్మనాభం మండలం ఆర్.తాళ్లవలస పంచాయతీకి ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు దొంతల సురేష్, కొణితుల సంతోష్, పార్వతి, నాయకులు ఎల్లయ్య, చందక శ్రీను, పంచాయతీ సిబ్బంది లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు 2003 -04 టెన్త్ పూర్వ విద్యార్థులు గురువారం సుమారు రూ.10 వేలు విలువైన ఫర్నీచర్ అందజేశారు. సైన్స్ ల్యాబ్ కోసం బల్లలు, కుర్చీలు అందజేశారు. ఫర్నీచర్ అందజేసిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు, అప్పలనాయుడు, వి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

గ్రామాల్లో 'మీకు తెలుసా'

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి పాండ్రంగి గ్రామాల్లో గురువారం 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి మాట్లాడుతూ, హెచ్‌ఐవి లాంటి లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలల పాటు 'మీకు తెలుసా' జిల్లా స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా జనాభాలో హెచ్‌ఐవి సుఖవ్యాధులు (ఎస్‌టిఐ) గురించి పరిజ్ఞానం, అవగాహన, హెచ్‌ఐవి ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు, ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మంది హెచ్‌ఐవి పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మణి, లక్ష్మి, రమాదేవి, సూర్యం పాల్గొన్నారు.

లైంగిక అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జ్యోతి

మత్స్యకారులకు బోటు ఇంజిన్లు

బోటు ఇంజిన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గంటా, దివీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆర్థిక సాయం రూ.59.40 లక్షల విలువైన 4 స్ట్రోక్ టాటా బోటు ఇంజిన్లను మండలంలోని పెద నాగమయ్యపాలెం గ్రామానికి చెందిన 11 మంది బోటు యజమానులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ద్వారా గురువారం అందించారు. ఇంజిను వల్ల కలిగే ఉపయోగాలను ఆయన మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. దివీస్ జనరల్ మేనేజర్ ఎంఎస్‌ఎన్.రావు మాట్లాడుతూ, సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు సరైన వేగంతో వెళ్లలేక తగిన మేర చేపలు లభించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ తరహా ఇబ్బందులు నుంచి బయటపడేందుకు ఇంజన్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ ఎన్.హనుమంతరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, పార్టీ నాయకులు జి.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

గంభీరంలో ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ పరిధిలో రూ.13.55 లక్షలతో ఏర్పాటుచేసిన మంచినీటి ఆర్ఒ ప్లాంట్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ ప్లాంట్ వల్ల చుట్టుపక్కల ప్రజలకు రక్షిత మంచినీరు లభిస్తుందని గంటా పేర్కొన్నారు. ఈ ఆర్ఒ ప్లాంట్‌కు దివీస్ సంస్థ నిధులు సమకూర్చింది. కార్యక్రమంలో గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి, బిఆర్‌బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, తమ్మిన అప్పలరాజు, టెడ్లపు నర్సింగరావు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖలో 'ఐబిడి' సదస్సు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : బ్రిక్స్ ఐబిడి 'ఇన్ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబిడి) సదస్సును విశాఖ నొవాటెల్ హోటల్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆంధ్రా మెడికల్ కళాశాల గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి, సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ఎల్ఆర్‌ఎస్ గిరినాథ్ తెలిపారు. గురువారం కెజిహెచ్ అంకానా హాల్‌లో కిమ్స్ వైద్యులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎఎస్ చలపతిరావుతో కలిసి మీడియా సమావేశంలో సదస్సు వివరాలు వెల్లడించారు.

. సిసిఎఫ్ ఇండియా సహకారంతో బ్రిక్స్ దేశాల ఐబిడి కన్సార్టియంను 8వ జాతీయ సదస్సుగా నిర్వహించనున్నామన్నారు. అత్యంత విషమమైన ఇన్ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (పేగు పోత జబ్బు)పై సదస్సులో పాల్గొనే నిపుణులు విపులంగా చర్చించడంతోపాటు, తమ పరిశోధనల్ని వివరిస్తారన్నారు. పేగు పోత వ్యాధిపై పరిశోధన పురోగతి, ఈ వ్యాధి తీవ్రత అంశాలపై లోతైన అవగాహనకు సదస్సులో నిష్ణాతులైన వైద్యులు పలుసూచనలు చేస్తారన్నారు. ఐబిడి రంగంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు యుఎస్‌ఎ, యూకే, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, నేపాల్, జింబాబ్వే వంటి దేశాల ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు హాజరుకానున్నారని తెలిపారు. పెద్ద ప్రేగులో సోకే ఈ వ్యాధి తీవ్రమైనదని, మధుమేహ వ్యాధి వలే రోగి జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుందన్నారు. దేశంలో ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించలేదని, క్షయవ్యాధిగా భావించి వైద్యం అందించే వారిన్నార. దేశంలో ఒకప్పుడు పేగు పోత జబ్బు అంతగా ఉండేది కాదని, అయితే మారుతున్న ఆహార అలవాట్లు వల్ల ఇది దేశంలో ప్రవేశించి,ఇప్పుడిప్పుడే తీవ్రస్థాయికి చేరుకుంటోందన్నారు. నీళ్ల విరోచనాలు, రక్తం రావడం, బరువు తగ్గడం ఈ వ్యాధి లక్షణాలన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గిరినాథ్

కిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, సదస్సు నిర్వహణ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఆచంట చలపతిరావు మాట్లాడుతూ, ఐబిడి అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది జీర్ణాశయాంతర పరిస్థితిని ప్రభావితం చేస్తుందన్నారు. భారతదేశంలో పెరుగుతున్న కేసులు, రోగుల ఫలితాలను మెరుగుపరచడానికి, మెరుగైన నిర్వహణ కోసం, కొత్త రోగ నిర్ధారణ, చికిత్సా వ్యూహాలను ఈ సదస్సులో లోతుగా చర్చిస్తారన్నారు. ఈ వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన వినూత్న చికిత్సలు, రోగి కేంద్రీకృత సంరక్షణ, మల్టీ డిసిప్లినరీ విధానాలను సదస్సు అన్వేషిస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు, ఆంధ్ర మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు 100 మంది హాజరవుతారన్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ అధినేత డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ములగాడ : భార్యాభర్తల గొడవ కారణంగా భర్త మనస్తాపం చెంది గురువారం ఉదయం రోడ్డు మీదకు వచ్చి పక్కనే ఉన్న చెట్టుకు ఉరి పోసుకొని ఆత్మచేసుకున్నాడు. జివిఎంసి 61వ వార్డు వెంకన్నపాలెంలో నివాసముంటున్న పిల్లి సన్యాసిరావు స్థానికంగా చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా సన్యాసిరావు భార్యతో వివాదం పడుతూనే ఉన్నాడు. దీంతో బుధవారం రాత్రి ఇంట్లోంచి వచ్చేసిన సన్యాసిరావు మనస్థాపానికి గురై గురువారం ఉదయాన్నే హెచ్‌పిసిఎల్ గోడకు ఆనుకొని ఉన్న చెట్టు పైకి ఎక్కి ఉరివేసుకుని ఆత్మ చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మల్కాపురం సిఐ విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబినెట్ దృష్టికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను కేబినేట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సీతంపేటలోని పల్లా శ్రీనివాసరావు నివాసంలో విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ ఆధ్వర్యాన సభ్యులు గురువారం ఆయన్ను కలిసి ఇళ్ల స్థలాల అంశాన్ని వివరించారు. విశాఖలో ఇళ్ల స్థలాలకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాల వివరాలు ఆయనకు అందజేశారు. అనంతరం సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ మాట్లాడుతూ, సుమారు 800 మందికి పైబడి జర్నలిస్టులు ఇంటి స్థలం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారన్నారు. వారందరికీ ఈ ప్రభుత్వ హయాంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ సలహాదారులు ధవలేశ్వరపు రవికుమార్, కోశాధికారి ఆలపాటి శరత్‌కుమార్, సహాయ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బందరు శివప్రసాద్, యు.భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిఎ.రావు, ప్రత్యేక ఆహ్వానితులు యర్రా నాగేశ్వరరావు, పవన్, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.గురునాథ్ పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు అన్నారు. గురువారం వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఇడి, ఎంఇడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్ ఉపాధ్యాయులుగా నిలిచే మీరంతా పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కల ఆవశ్యకత, పర్యావరణం ప్రాధాన్యత తెలియజేయాలన్నారు. మొక్కలు నాటి, పెంచే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందనే వాస్తవాన్ని వారికి వివరించాలన్నారు. వివిధ వేడుకల్లో మొక్కలనే బహూకరించే సంప్రదాయాన్ని అవలంబించాలని సూచించారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, డాక్టర్ వినీల కుమారి పాల్గొన్నారు.

బోధనలో నూతన విధానాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : బోధనలో నూతన విధానాలను అవలంబిస్తూ, ఆసక్తిదాయకంగా బోధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం సెనేట్ మందిరంలో ఆర్ట్స్ కళాశాల పరిధిలోని గెస్ట్ ఫ్యాకల్టీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ సహచరులతో, విభాగాధిపతులతో సమన్వయం చేసుకుంటూ వెళ్లాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ రుసుమును పెంపుదల చేసే దిశగా కృషిచేస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తీ రెండు శాస్త్రాలలో లోతైన అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలో ఏయూలో డబల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ తరగతులు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, బోధనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పోర్టు హాస్పిటల్‌ను రక్షించుకునే వరకూ పోరాటం

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్‌ను రక్షించుకునేవరకూ పోరాటం కొనసాగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 3వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షను ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విశాఖపట్నం అభివృద్ధికి పోర్టు ప్రధాన కారణమన్నారు. పోర్టు వద్ద రూ.వేల కోట్లు రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని తెలిపారు. వాటితో హాస్పిటల్‌ను నిర్వహించాలని డిమాండ్‌చేశారు. దీనిపై జిల్లాలో ఉన్న అన్ని సంఘాల మద్దతు కూడగట్టి పోరాడతామన్నారు. వైజాగ్ పోర్టు రూ.386 కోట్లు లాభాలతో నడుస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏటా రూ.171.42 కోట్లు వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తుందని వివరించారు. ఇంతటి అభివృద్ధిలో కార్మికుల కృషి ఉందని, అటువంటి కార్మికులకు వైద్యం అందించే హాస్పిటల్‌ను ప్రయివేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ దీక్షల్లో జె.సత్యనారాయణ, కనకారావు, అప్పలనర్సమ్మ, ధనలక్ష్మి, పైడమ్మ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, బి.జగన్, వియన్.మూర్తి, బి.జగన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

టమాటా, ఉల్లి ధరల నియంత్రణపై దృష్టి సారించాలి : జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:మార్కెట్‌లో టమోటా, ఉల్లిపాయల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రస్తుతం ఉల్లిపాయలు ,టమోటా ధరలు అధికంగా ఉన్నాయని, వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. చిత్తూరు నుంచి టమోటాలను తీసుకురావాలని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు బజార్లు, బయట మార్కెట్లలో ధరలను పరిశీలించాలని, కమిటీ సభ్యులు, అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. రైతు బజార్లలో ఉండే ఎస్టేట్ అధికారులు బాధ్యతగా పని చేయాలని జెసి సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఎడి యాసిన్, హార్టికల్చర్, డిఎస్వో, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, ధరల నియంత్రణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి రైతు బజార్ వద్ద ధర్నా సిఐటియు, ఐద్వా నాయకులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-పెందుర్తి : నిత్యవసరాల ధరలు తగ్గించాలని కోరుతూ ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి రైతుబజార్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు బి.రమణి మాట్లాడుతూ, ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఉల్లి, టమోటా, ఆయిల్ ధరలు పైకిఎగబాకుతున్నాయని పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ధరలను అదుపుచేయకపోవతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇసుక అందక భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి వెంకటలక్ష్మి, సిఐటియు మండల ప్రెసిడెంట్ కె.అప్పలనాయుడు, సిఐటియు నాయకులు ప్రభుదేవా, ఈశ్వరరావు, మహేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి భానోజీతోటలో రూ.39 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు, వరదనీటి కాలువ నిర్మాణానికి కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచన మేరకు వార్డులో పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. వార్డులో ఇండోర్ స్టేడియం ఆధునీకరణ చేపట్టామని, ఈత కొలను నిర్మించామని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, భానోజీ తోట అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నరసింహా పాత్రుడు

‘పద్మపూజిత’లో దసరా ఆఫర్లు

పద్మ పూజిత వీల్స్ మార్ట్

సంస్థ చైర్మన్ బసవరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : పద్మపూజిత వీల్స్ మార్ట్‌లో దసరా ఆఫర్స్ పెట్టినట్లు సంస్థ చైర్మన్ బసవరాజు తెలిపారు. దొండపర్తిలోని కార్యాలయంలో ప్రజాశక్తితో గురువారం ఆయన మాట్లాడుతూ, ఏటా దసరా పండుగను పురస్కరించుకుని వినియోగదారులకు ఆఫర్లు ప్రకటిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ప్రతి టూ వీలర్ కొనుగోలుదారునికీ సుమారు 3299 విలువగల గిఫ్ట్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీతో కూడిన ద్విచక్రవాహనాలను అతి తక్కువ ధరతో తక్కువ సమయంలోనే అందిస్తున్నట్లు వివరించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న 140 బ్రాంచీలలో ఈ దసరా ఆఫర్స్ ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా లక్కీ డ్రా కూడా ఉంటుందని చెప్పారు. లక్కీ డ్రాలో 24 లెనివో ల్యాప్‌టాప్‌లు, 12 ల్యాప్‌టాప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్లు సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. పద్మ పూజిత వీల్స్ మార్ట్ ప్రారంభమై నేటికి 22 సంవత్సరాలు పూర్తి చేసుకుని దిగ్విజయంగా నడుస్తోందన్నారు. ఎంతో ఆదరాభిమానాలతో ఆదరించిన ప్రజలకు వాహనాలను మరింత చేరువ చేసేందుకు ఆఫర్లు పెట్టినట్లు తెలిపారు. సంస్థకు వచ్చిన లాభాలను కొంతమేరకు పద్మ పూజిత ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల పిల్లలకు ఏటా స్కాలర్‌షిప్‌గా సుమారు రూ.పది లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ దసరా ఆఫర్లను ప్రజలు సద్వినియోగం పరచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంస్థ చైర్మన్ బసవరాజు

చెత్త పన్ను రద్దుపై హర్షం

-వాణిజ్య సంస్థలకు కూడా రద్దు చేయాలి
-వార్వా నివాస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్: ఇళ్ల నుండి వసూలు చేసే చెత్తపన్ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనను వార్వా, నివాస్ ఆహ్వానిస్తుందని వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి గణేష్,నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల వారు హర్షం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2021లో ప్రతి ఇంటికి నెలకు రు.120 చెత్త సేకరణ ఛార్జీలు గత ప్రభుత్వం విధించిందన్నారు. ఈ ఛార్జీలను ప్రతి ఏడాది 15 శాతం పెంచే ప్రతిపాదన కూడా చేసిందన్నారు. ఆస్తిపన్నులో చెత్తపన్ను కలిసి వున్నదని, అదనంగా చెత్త సేకరణ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని, ఈ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ వార్వా,నివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఉద్యమం నిర్వహించామన్నారు. అనేక సభలు, సమావేశాలు నిర్వహించి వాట్సాప్, సోషల్ మీడియాలలో ప్రచారం చేసి, ప్రజలను చైతన్య పరిచామన్నారు. మేయర్, కార్పొరేటర్లకు, మంత్రులకు, ప్రభుత్వానికి ఎన్నో విన్నపాలు సమర్పించామని తెలిపారు. ప్రజలు కూడా చెత్త పన్ను ను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఈ పోరాటం ఫలితంగా అనేక వార్డుల్లో ప్రజలు చెత్త పన్ను చెల్లించకుండా తీవ్రంగా ప్రతిఘటించారన్నారు. చెత్తపన్నును ప్రజలు ముక్తకంఠం తో వ్యతిరేకిస్తున్నందున ఈ సమస్యకు ఎన్నికలలో ప్రాధాన్యత పెరిగిందని, రద్దు చేస్తానని చంద్రబాబు హామీ ఇవ్వడం, చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. వాణిజ్య సంస్థలకు కూడా చెత్తపన్ను రద్దు చేయాలని ముఖ్యమంత్రికి వారు విజ్ఞప్తి చేశారు.

లీగల్ : చెత్తపై పన్నును ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేయడంపై టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శోభన్ బాబు, విశాఖపట్నం అధ్యక్షులు బత్తి రాజశేఖర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందనిని పేర్కొన్నారు.

వివిఎన్‌ఎం.రాజాకు సంతాపం

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి టోల్‌గేట్ వద్ద ఉన్న శివాజీనగర్‌లో గాజువాక మున్సిపాల్టీ మాజీ చైర్మన్ వివిఎన్‌ఎం.రాజా సంతాప సభ గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గణబాబు, మాజీమంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పలువురు వైసిపి, కాంగ్రెస్ నాయకులు హాజరై రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజా అభిమానులు, స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

డాక్‌యార్డు ప్రాంతంలో పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి-ములగాడ : డాక్‌యార్డు వద్ద వంతెన మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు ఆందోళనలు చేస్తుండటంతో ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. నేవీ, సివిల్ పోలీసులు గురువారం అధిక సంఖ్యలో మోహరించారు. పెద్ద సంఖ్యలో ఆందోళన జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు భద్రత ఏర్పాటుచేసినట్లు మల్కాపురం సిఐ విద్యాసాగర్ తెలిపారు. ఇక్కడ నిరసనలకు అనుమతులు లేవని చెప్పారు.

నిత్యావసరాలను అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : శ్రీనివాసనగర్‌లో మనసు ఆడపిల్లల అనాథాశ్రమానికి శ్రీ వరహా లక్ష్మీ నరసింహ వాకర్స్ క్లబ్ గోశాల జంక్షన్ ప్రెసిడెంట్ జి.నాగార్జున ఆధ్వర్యాన నిత్యావసరాలను అందించారు. 5 బస్తాలు బియ్యం, సుమారు రెండు నెలలకు సరిపడే వస్తువులు, 40 తువ్వాళ్లు, కొంత నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పిట్టా శ్రీహరి, ఎస్.రామకృష్ణ, పి.త్రినాధ్, లక్ష్మణరావు, ఆచారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 8, 9, 10 తరగతుల విద్యార్థులు జస్వంత్, నీరజ్, గురువిష్ణులను గురువారం ప్రిన్సిపల్ క్రిస్టీజాన్, కరస్పాండెంట్ త్రిసామేరీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

అనకాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సర్వసామదాంబ పార్కు జంక్షన్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని అధికారంలోకి వచ్చి తీరా ఇప్పుడు రవాణా ఛార్జీలు పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇసుక కొరతతో నిర్మాణం రంగం మందకొడిగా సాగుతోందని, దీంతో రోజూ వందలాది మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఇసుకకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పి నాయకులు, రెవిన్యూ, పోలీస్‌లు అక్రమంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 110

భీమిలిలో సిపిఎం నాయకుల నిరసన

పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

రోజులు దాటినా నేటికీ ఇసుకపై స్పష్టమైన విధానం అమలు చెయ్యలేదన్నారు. ఇప్పటికైనా స్థానికంగా ఉన్న నదులు నుండి ఇసుకను వినియోగదారులు ఉచితంగా తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు కొయ్య లక్ష్మణ్, మాడిసి అప్పారావు, సూరిశెట్టి సత్తిబాబు, సేనాపతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఉచిత ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక కృష్ణాకాలనీ ఇసుక డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఇసుక లేక భీమిలిలోని డిపో మూత పడిందన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కె.నాగరాణి, భాగం లక్ష్మి, అన్నాబత్తుల నరసింగరావు, కార్యకర్తలు జోగ ఆనంద్,

జీరు సత్యారావు, కొత్తయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : ఇసుక సమస్య పరిష్కరించాలని హనుమాన్ నగర్ నుంచి నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్ వరకు సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఇసుక అందుబాటులోకి తేవాలని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని, సంక్షేమ బోర్డు పథకాల అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇసుక అందుబాటులో ఉంది, ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెబుతున్నా వాస్తవానికి ఎక్కడా ఇసుక లేదని తెలిపారు. ఇసుక సమస్యపై శుక్రవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు చేపట్టే ర్యాలీలో పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బూడి శ్రీను, దున్న రాజేష్, ఎస్‌కె.సుభాని, సురేష్, యు.రాజారావు, ప్రశాంత్, జి.రామకృష్ణ, భవన నిర్మాణ కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

62వార్డు పరిధి జి.వి.కాలనీ కూడలిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, ఉచిత ఇసుకను తక్షణమే అందుబాటులోని తేవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు పిసిని.రామారావు, బి.జగ్గునాయుడు, కె.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడలో మాట్లాడుతున్న పైడిరాజు

పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ కలెక్టరేట్ : ఇసుక కొరతను నివారించి భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 4న జరిగే నిరసనలో భాగంగా పంది మెట్ట, సింగ్ హోటల్ జంక్షన్ సమీపాన గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం జరిగే నిరసనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొండారావు, సిమ్మనాయుడు, జనార్దనరావు, రామారావు, శ్రీనివాస్, వెంకటరావు, నాయుడు, పార్వతి, ఈశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు

అన్న క్యాంటీన్ ప్రారంభం

అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్

ప్రజాశక్తి - యలమంచిలి : బడుగు, బలహీన వర్గాల ఆకలి తీర్చి, వారిని ఆదుకొని అక్కున చేర్చుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం గురజాడ జూనియర్ కాలేజ్ ఎదురుగా అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల మేరకు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించి రూ. 5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. ప్రతిరోజూ కనీసం 500 మందికి భోజనం అందిస్తారన్నారు.మున్సిపల్ చైర్పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ తరతమ భేదం లేకుండా అన్ని పార్టీల నాయకులకు సమానదూరం పాటిస్తూ పథకాలు అమలు చేస్తానని ఆనందంగా ఉందన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, తర్వాత అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, డిఇ వీరయ్య, టౌన్ ప్లానింగ్ శ్రీలక్ష్మి, ఎఇ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్, కూటమి నేతలు బొద్దపు శ్రీనివాసరావు, ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, నానాజీ, కొఠారు నరేష్, కొఠారు శ్రీనివాస్ మాస్టారు, తదితరులు పాల్గొన్నారు. తొలిరోజున ప్రజలకు ఎమ్మెల్యే, చైర్పర్సన్ స్వయంగా భోజనం వడ్డించారు.

ఫార్మా కార్మికులకు బోనస్ చెల్లించాలి

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గనిశెట్టి

ప్రజాశక్తి- పరవాడ: జెఎన్ ఫార్మాసిటీలో ఫార్మా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్ 20 శాతం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మా కార్మికులకు యాజమాన్యాలు దసరా సందర్భంగా సెప్టెంబర్ నెల జీతంతోపాటు ఇరవై శాతం బోనస్ కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. లాభాలు సాధిస్తున్న ఫార్మా పరిశ్రమలు 1965 బోనస్ చట్టం ప్రకారం బోనస్ చెల్లించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు సిఐటియు నాయకులు ఆర్ లక్ష్మణరావు, కె.శ్రీను, ఎన్ రామకృష్ణ, వై నాగేశ్వరరావు, ఆర్ రాజు, ఆర్ తులసిరావు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రామునాయుడు

ప్రజాశక్తి- విశాఖపట్నం : అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేయడం ద్వారా నగరంలోని సుందరయ్య కాలనీ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రాము నాయుడు తన సేవా భావాన్ని చాటుకున్నారు. కంచరపాలెంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పి.విజయలక్ష్మి అనే వృద్ధాప్య లబ్ధిదారు పింఛను తీసుకునేందుకు రాలేని పరిస్థితుల్లో రామునాయుడు గురువారం ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. సంబంధిత లబ్ధిదారుకు పింఛను అందజేసే బాధ్యతను సచివాలయ మహిళా పోలీసుకు అప్పగించినప్పటికీ, ఆమె మెటర్నిటీ లీవ్‌లో ఉండడంతో వెల్ఫేర్ సెక్రటరీ రామునాయుడు చొరవ తీసుకుని లబ్ధిదారుకు పింఛను అందజేశారు. దీంతో లబ్ధిదారు హర్షం వ్యక్తం చేసి, కృతజ్ఞతలు తెలిపింది.

9లోగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం విధానంలో భాగంగా కొత్తగా మద్యం దుకాణాలకు ఈనెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ డి.అనిల్ కుమార్ తెలిపారు.సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో సబ్బవరం, పరవాడ డివిజన్లకు సంబంధించి 19 షాపులకు గాను సబ్బవరం ఎనిమిది షాపులు, పరవాడ 11 షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఒక షాపునకు రూ.రెండు లక్షలు చొప్పున ఈనెల 9లోగా డిడిని చెల్లించి, దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పంపాలన్నారు. ఈనెల 11న ఉదయం 8 గంటలకు అనకాపల్లి ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సమక్షంలో డ్రా తీసి దుకాణాలను కేటాయిస్తారన్నారు. అయితే దరఖాస్తు దారులకు గతంలో ఎటువంటి నేరచరిత్ర ఉండకూడదని, ఎక్సైజ్ శాఖలో బకాయిలు ఉండకూడదన్నారు.

పర్యాటక ప్రాంతంగా బొజ్జన్న కొండ అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలోని పేరెన్నికగన్న పర్యాటక ప్రాంతంగా బొజ్జన్న కొండను అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు.రూ. 7 కోట్ల 38 లక్షలతో శంకరం దరి బొజ్జన్న కొండకు లేజర్, సౌండ్ షోలను బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొజ్జన్న కొండ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని, పర్యాటక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక పరిశ్రమగా గుర్తించి ఇటువంటి చారిత్రక స్థలాలను అభివృద్ధి చేయనుందన్నారు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఎంపీ సీఎం రమేష్ ఆధ్వర్యంలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుతో పాటు ఈ ప్రాంత రైల్వే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే కొణతాల ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా

పారిశుధ్య కార్మికులను సత్కరించిన ఎంపి, ఎమ్మెల్యేలు

జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యానుల్లో తరలిస్తున్న గోవుల పట్టివేత

పోలీసులు పట్టుకున్న ఆవులున్న వ్యానులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : నాలుగు వ్యాన్లల్లో భారీ సంఖ్యలో కబేలాకు తరలిస్తున్న పాడిపశువులను బుచ్చయ్య పేట మండలంలో గురువారం పోలీసులు స్థానిక యువకులు సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి ఒక్కొక్క ఐషర్ వ్యాన్‌లో 60 వరకు ఆవులను కుక్కి, నాలుగు వ్యాన్లలో 250 వరకు పశువులను అరకు, పాడేరు మీదుగా ఏలూరు దరి హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తుండగా, వడ్డాది సమీపంలో బుచ్చయ్యపేట పోలీసులు పట్టుకున్నారు. పలు చెక్ పోస్టులను యథేచ్ఛగా దాటుకుని, ఆవులు అక్రమ రవాణాపై పలువురు విస్మయం చెందుతున్నారు. ముడుపుల కక్కుర్తితో కొందరు అధికారుల అండదండల తోనే ఈ పశువుల దందా సాగుతోందాయని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆగా వ్యాన్లల్లో పైన, కింద రెండు అరలుగా, కిక్కిరిసి పోయినట్లు పాడిపశు వులను కుక్కి, తరలించడంతో అవి పడుతున్న బాధను చూసి పలువురు ఆవేదన చెందుతున్నారు.

నంబర్ ప్లేట్లు లేకుండా రవాణా

పోలీసులు పట్టుకున్న నాలుగు ఐసర్ వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేవు. ఆ వాహనాల పైభాగం నుండి కింద వరకు పాలిథిన్ కవర్లను కప్పి తాళ్లతో కట్టి ఆవులను తరలిస్తున్నారని పోలేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త సీత నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవుల అక్రమ రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

విజేతలకు సర్టిఫికెట్లు అందజేత

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : నేత్రదానం మరొకరికి జీవితాన్ని ఇస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు.కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్, డిబిసిఎస్ రమణ కుమార్ పాల్గొన్నారు.

6న నాటికల ప్రదర్శన

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహక కమిటీ

ప్రజాశక్తి- మునగపాక: ఆర్ఐసిఎస్ మాజీ ఛైర్మన్ పెంటకోట జనరాజుదాస్ 65వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 6న రాత్రి 7 గంటలకు స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం వేదికపై నాటికలు ప్రదర్శించనున్నట్లు గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాములెతెలిపారు గురువారం దీనికి సంబంధించిన కరపత్రాలను స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరాజుదాస్ జయంతిని పురస్కరించుకొని 6న రాత్రి 7 గంటలకు సాయి కార్తీక క్రియేషన్స్ కాకినాడ వారిపై 'క్రీనీడ'అనే నాటిక ప్రదర్శన ఉంటుందని, తర్వాత ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు (గుంటూరు) వారిచే "విముక్తి "అనే నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. కళాభిమానులు, కళాకారులు, దాసు మిత్రులు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో పెంటకోట వెంకటరావు, కోనపల్లి రామ్మోహన్ రావు, టెక్కలి వీర కొండలరావు, మల్ల కష్ట, ఆడారి సోమశేఖర్, మల్ల ముసలి నాయుడు, పెంటకోట వెంకట్, వేగి కృష్ణ పాల్గొన్నారు.

జిఒ117ను తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి: జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. గురువారం కొలపర్తి అప్పారావు భవన్లో జిల్లా అధ్యక్షులు కేవీఎల్ఎన్ ధర్మారావు అధ్యక్షతన అనకాపల్లి జిల్లా ఎపిటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ పాల్గొనఅనరు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా అధ్యక్షులు ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఓటర్లను చేర్పించడం ద్వారా వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు నూకరాజు, పడాల అప్పారావు,ఎం. మహాలక్ష్మి నాయుడు, జయలక్ష్మి, మోబినా, గణేష్,కె. శ్రీనివాస్, సన్యాసినాయుడు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నవోదయ, సైనిక స్కూల్ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలో నవోదయ, సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్థానిక మినర్వా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం తరపున ఉచితంగా గణితంలో మూడు ఆన్‌లైన్ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైలా పైడనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోగా తమ పేర్లను 9052271874 వాట్సాప్ నెంబర్‌కు మెసెజ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి రైతు సేవా కేంద్రం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా బస్తాలను గురువారం రైతులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను రైతులు సద్వినియోగం చేసువాలని కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షులు పి. రాజు, అప్పలనాయుడు, తాతబాబు, వ్యవసాయ సిబ్బంది వర ప్రసాద్ పాలొగొన్నారు.

రహదారుల్లో పిచ్చిమొక్కల తొలగింపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట, చీమలపల్లి గ్రామాలలో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను గురువారం తిమ్మరాజుపేట గ్రామం నుంచి పెదపాడు వెళ్లే రహదారిలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు జెసిబి సహాయంతో తొలగించారు. ఈ పనులను ఎస్ శివ బాపునాయుడు, ఎస్ నాగార్జున పర్యవేక్షించారు. చీమలపల్లి నుంచి ఆవ సోమవారం వెళ్లే రహదారి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి వాహనదారులు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. గ్రామ సర్పంచ్ సియాద్రి నాగ నూకరాజు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో వీటిని తొలగించారు.

సమస్యల పరిష్కారానికి ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని, ఐఆర్డిఏ ప్రవేశపెట్టిన ఏజెంట్ల వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి జీవిత బీమా కార్యాలయం ఎదుట గురువారం భారీస్థాయిలో ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఎఐఏ యూనియన్ అనకాపల్లి బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదునాయుడు అధ్యక్షతన ధర్నాలో మాట్లాడుతూ రూ.ఐదు లక్షలు ఉన్న గ్రాడ్యూటీని రూ.10 లక్షలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచాలని, ఇన్సూరెన్స్ 70 నుండి 80 ఏళ్ళకి పెంచాలని డిమాండ్ చేసారు. జిల్లా అధ్యక్షులు గొర్లి శంకరావు, సీనియర్ ఏజెంట్స్ నడిశెట్టి అప్పారావు, పీలా శ్రీనివాసరావు, ఉప్పు నూరి అప్పారావు, గైపూరి భాస్కర్, బ్రాంచ్ సెక్రటరీ కరణం మాణిక్యారావు, కొండలరావు మాట్లాడుతూ ఏజెంట్స్‌కు వ్యతిరేకంగా అమలు చేసిన విధానాలు విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. శుక్రవారం ప్రతి ఏజెంట్ నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఐతా రాము, రొంగలి వెంకట్రావు, బొండా నూకరాజు, జగన్, అప్పలనాయుడు నందిని, రాజేశ్వరి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాట్లాడుతున్న బొడ్డేడ అప్పారావు

ప్రజాశక్తి -అనకాపల్లి : గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం సుంకరమెట్ట సత్తెమ్మతల్లి ముఖద్వారం దరి షిర్డీ సాయి లా కాలేజీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమావేశంలో 160 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగ మహాత్మాగాంధీ చిత్రపటానికి లా కాలేజీ ప్రతినిధి బొడ్డేడ శ్రీను పూలమాలవేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో నూతన సభ్యుల పరిచయాన్ని కమిటీ ఛైర్మన్ పిళ్ళా శివప్పారావు చేయగా కమిటీ నివేదికను సంఘ కార్యదర్శి దాడి శివ రామకృష్ణ వినిపించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, అధ్యక్షులు బల్ల నాగభూషణం, కోశాధికారి పట్నాల కృష్ణమోహన్, సంఘ సలహా సభ్యులు కె.ఎస్.ఆర్.బాబ్జీ, సభ్యులు కాండ్రేగుల జగన్నాధరావు, పొన్నా చల్మాజీ, బుద్ద వీరునాయుడు, కాండ్రేగుల దుర్గా ప్రసాద్, కొత్తుర్తి రామారావు, దాడి శివ రామ్,దాడి నూకప్పారావు, కె.సత్యనారాయణ, బుద్ద రాయుడు, మారోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి సభ్యులకు రూ.5 లక్షల బీమా

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షలబీమా సౌకర్యం వర్తిస్తుందని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం అచ్యుతాపురంలో ఎలమంచిలి నియోజకవర్గస్థాయి టిడిపి కార్యకర్తల సమావేశంలో ముందుగా టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాల వేశారు. పార్టీ ఐటిడీపీ ప్రతినిధులను సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూ.వంద రుసుముతో టిడిపి సభ్యత్వం చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ లాలం భవాని భాస్కరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల శాఖ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, మెరుగు బాబునాయుడు, ధూళి రంగనాయకులు, దిన్ బాబు , దాడి ముసలి నాయుడు పాల్గొన్నారు.

సభ్యత్వం అందజేస్తున్న మాజీ ఎంపీ, ఇతర నేతలు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -అనకాపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కును బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో మండలానికి చెందిన రాపేటి హిమాన్షి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.2లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ సిఫార్సు మేరకు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైంది. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల దుర్గాదేవి విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి -పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో ఆదర్శ మోటార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రామాలయం వద్ద గురువారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి పైలా జగన్నాధ రావు, పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల రామారావు, ఉప సర్పంచ్ వసంతరావు, ఆదర్శ మోటార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కూండ్రపు పరమేష్, వార్డ్ మెంబర్స్ వెంకటరమణ, రొంగల అప్పారావు, యూనియన్ నాయకులు,పైల కృష్ణ, డి.ఎంఎల్ నాయుడు, సిహెచ్ పరుశరాములు, జి ముత్యాల నాయుడు, కూండ్రపు కోటేశ్వరరావు, బి విశ్వేశ్వరరావు, గొరువుటి నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు: దుర్గాదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని అయ్యన్న విద్యాసంస్థలలో గురువారం దుర్గామాతకు పూజలు చేశారు.. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా బొమ్మల కొలువు ప్రదర్శించారు. తొలి రోజున బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. రామయోగి అగ్రహారం మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి చల్లా శకుంతల, సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు పూజలు చేశారు చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయిఅయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, డైరెక్టర్ నూర్జహాన్ తెలుగు ఉపాధ్యాయుడు బండారు వెంకటరమణమూర్తి, ఉపాధ్యాయులు సుమతి, పద్మిని, కళ్యాణి, శిరీష, శివ, ధనలక్ష్మి, సాయిలక్ష్మీ, సుశీల, జ్యోతి, శ్రావణి, మున్నీషా, చంద్రకళ, స్వాతి, సత్యవతి, దీప్తి, సీమసురు రమణ, గాడి అప్పారావు, ప్రసాద్, డేవిడ్ పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో రోడ్డు మరమ్మతులు

మరమ్మతులు పర్యవేక్షిస్తున్న సిఐ

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ, లంకెలపాలెం ప్రధాన రోడ్డులో పెద్ద గుంతలను రాంకీ ఫార్మా సహకారంతో పోలీసులు ఆధ్వర్యంలో గురువారం పూడ్చారు. ఈ మార్గంలో భారీగోతులతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానిక సిఐ ఏర్పడడంతో ఆర్ మల్లికార్జునరావు సమస్యను రాంకీ ఫార్మా యాజమాన్యం దృష్టికితీసుకెళ్లారు. వారి సహకారంతో గురువారంసిఐ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో పోలీసులు దగ్గరుండి గుంతలు పూడ్చారు. పోలీసుల చొరవను వాహనదారులు అభినందిస్తూ, సిఐకి ధన్యవాదాలు తెలిపారు.

పిహెచ్‌సి అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి పిహెచ్‌సి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బోకం సూర్యకుమారి రామునాయుడు అన్నారు. గురువారం పిహెచ్‌సిలో పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ పిహెచ్‌సి అభివృద్ధికి కేటాయించిన నిధులతో మౌలిక వసతుల కల్పన, పూర్తిస్థాయిలో సిబ్బంది ఏర్పాటు, రోగులకు అందుబాటులో అన్ని మందులు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్. శాంతి, సర్పంచ్ బండారు మంగ, బైలాపూడి గౌరీ, యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ జి. దేముడు బాబు పాల్గొన్నారు.

రోబోటిక్స్ అండ్ టెక్నాలజీలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి రికార్డు

మహిత్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిఇఒ

ప్రజాశక్తి - పరవాడ: న్యూ ఢిల్లీలోజరిగిన ఇంటర్నే షనల్ కాన్వొకేషన్ 2024లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి కె.శ్రీమహిత్ రాజ్ జాతీయ రికార్డును కైవసం చేసుకొన్నాడు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధి వియత్నాంకు చెందిన డాక్టర్ .జూలీయా నుంచి అవార్డు అందుకొన్నాడు. అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి, సిఇఒ కె. నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో 'సంస్కృతి' విద్యార్థులు

ప్రజాశక్తి - పరవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3,4 తేదీల్లో ఏలూరు జిల్లా పెదవేగిలో ఎపిఎస్‌డబ్ల్యుఆర్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన అండర్-19 బాయ్స్ అండ్ గర్ల్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ 12వ తరగతి విద్యార్థులు ఎ.వి.శశాంక్ వర్మ, పి .మహేష్, బి .రోహిత్‌రాజు, కె .ధీరజ్ శ్రీరామ్ ఎంపికై పాల్గొంటున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. వీరితో పాటు కోచ్ రాజేష్‌ను పాఠశాల సిఇఒ కె. నిశంత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సుధీర్ ఎంపిక

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం భార్గవి విద్యామందిర్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి రెడ్డి సుధీర్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ రవి తెలిపారు. ఇటీవల జరిగిన మండల, జిల్లాస్థాయి వాలీబాల్, 100,200,400మీటర్ల పరుగుపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన సుధీర్‌ను కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.



సుధీర్‌ను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రవి

కొత్తరకం వరి వంగడాలను సాగు చేయాలి

- పొలంబడి కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు

అవగాహన కల్పిస్తున్న మాడుగుల ఎఓ

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని లింగ భూపాల పట్నం, ఖండివరం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని రమాదేవి మాట్లాడుతూ, రైతులకు వరి పంట సాగులో జీవన ఎరువుల ప్రాముఖ్యతపై వివరించారు ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు

కె.కోటపాడు: కృషి విద్యాన కేంద్రం ద్వారా అందిస్తున్న రైతు శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్ సూచించారు. ఆర్ వై అగ్రహారం, వారడా సంతపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుతం వరిలో పోషక లోపాలున్నాయని తెలిపారు.చోడవరం చెరుకు ఫ్యాక్టరీ అధికారి మోహన్ చెరుకు పంట రకాలను మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కిషోర్ కుమార్, నాగభూషణం, యడ్ల బలరాం, సర్పంచ్ లెక్కల దేవి లత, ఉపసర్పంచ్ సింగంపల్లి వెంకట రమణ, సెక్రటరీ ప్రశాంత్ పాల్గొన్నారు.

కశింకోట : వరి, చెరుకు పంటల సాగు యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి పరిశోధన స్థానం శాస్త్రవేత్త అదిలక్ష్మి అన్నారు, తాళ్ళపాలెంలో పొలం పిలుస్తుందిలో రైతులు కు పలు సూచనలు చేశారు. ఎఒ ఎం.స్వప్న, మైక్రో ఇరిగేషన్ అధికారి రంజిత, రైతులు కర్రి వెంకట సత్య నారాయణ, చిన్ని కోటేశ్వరరావు, ముత్తా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల: రైతాంగం అధిక దిగుబడినిచ్చే వరి వంగడాల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు తెలిపారు. మండలంలోని యం.కోటపాడు, ముకుందపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు పాత వరి రకాలను మాత్రమే సాగు చేస్తున్నారని, వీటి స్థానంలో కొత్తగా విడుదలైన ఇంద్ర, అమర్, మారుటేరు సాంబ, శ్రీధృతి, ఎం టి యు-1318, ఆర్ఎన్ఆర్ - 15048 అనే అధిక దిగుబడి నిచ్చే వంగడాలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హెచ్.వాసుదేవరావు, కొండెంపూడి కెవి కె శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్ కుమార్, సౌజన్య, యం. కోటపాడు గ్రామ నాయకులు సేనాపతి గంగాధర్, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సీడీవో రామన్ పాల్గొన్నారు.

తగరపువలస : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన భీమిలి మండలం సింగనబంద, తాటితూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి నమూనాలు సేకరణ, ఫలితాలు తదితర అంశాలపై రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది స్వాతి, కృప మణి, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలోని కణమాం, గిడిజాల గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయం, బిందు సేద్యం గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.సుబ్రహ్మణ్యం వివరించారు. వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్యరత్నప్రభ పొలం పిలుస్తోంది అవశ్యకతను వివరించారు. ప్రకృతి వ్యవసాయం, కషాయలపై ఎన్ఎఫ్ఎ శ్రీనివాసచక్రవర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో వి.రామారావు, పి.సరోజిని పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి చలం ఆధ్వర్యాన తెగుళ్ల, ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు.

ఆర్‌డిఒను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నూతనంగా నియమితులైన ఆర్డీవో వివి రమణను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆర్డీవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ పట్టణ జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్ మాట్లాడుతూ, నర్సీపట్నంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆర్డీవో సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చూస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట శేఖర్, జగదీష్, మారిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సిఎం రమేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపీ సీఎం రమేష్ నియమితులైన సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాజాన వీర సూర్య చంద్ర మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాతవరం, నర్సీపట్నం మండలం జనసేన నాయకులు కృష్ణ, మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కావిడి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఉపమాకలో వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవములు ఈనెల 3 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు 12 రోజులు పాటు వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు గురువారం ఉదయం ఉత్సవాలు ప్రారంభక సూచికగా ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు సంపర్ణల పల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ కావిడితో గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారికి పసుపు, కుంకుమ, కొబ్బరి బొండాలు సమర్పించారు. సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. అనంతరం రాత్రి అశ్వ వాహనంపై తిరిగిన సేవ నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తిరు వీధి సేవలు, 11 న మృగ వేట కార్యక్రమంలో భాగంగా రాత్రి బంధుర సరస్సు వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమం, 12న వినోదోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులు ఉత్సవ ఏర్పాటు చేశారు.

విజయవాడకు వెళుతున్న భక్తులు

కాలినడకన భవానీ భక్తులు విజయవాడకు..

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కరక గ్రామానికి చెందిన 15 మంది భవానీ భక్తులు గురువారం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కాలినడకన బయలుదేరారు. ఉదయాన్నే గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విజయవాడ బయలుదేరారు.

గొలుగొండ:మండలంలో లింగంపేట గ్రామానికి చెందిన ఐదుగురు భవానీ భక్తులు కాలినడకన విజయవాడ వెళ్లేందుకు గురువారం ప్రయాణమయ్యారు. భవానీ దీక్షను తీసుకొని దసరా నాటికి విజయవాడ దుర్గమ్మ దేవాలయానికి చేరుకు నేటట్లుగా కాలినడకను ప్రారంభించామని భవాని భక్తులు నరసింగరావు, నాగేశ్వరరావు, తాతాజీ తదితరులు తెలిపారు.

పరిశీలిస్తున్న తహశీల్దార్, నాయకులు

జగనన్న లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలో గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్ వద్ద మౌలిక వసతుల కల్పనపై దీర్ఘకాలికంగా ఎదురవుతున్న సమస్యను గురువారం తహసిల్దారు తిరుమలబాబు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీనుతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా కాలనికి వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో సమీపంలో రైతులు స్వచ్ఛందంగా ఇచ్చేందుకు అంగీకరించడంతో సిబ్బందితో కలిపి సర్వే నిర్వహించి రహదారి ఏర్పాటుకు పక్కాగా చర్యలు చేపడతామని, లింగాపురం చెరువు నీరు కాలనీ పై వచ్చి ముంపు గురి కావడంతో నీటిని మళ్లించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. కాలనీవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపడతామని జానకి శ్రీను అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, రాంబాబు, హౌసింగ్ ఏఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోవాలి

కోటవురట్ల, నక్కపల్లిలో గ్రామసభలను నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:గ్రామ సమస్యలపై గ్రామ సభలను సద్వినియోగించుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో గ్రామాభివృద్ధి పై గ్రామ సభలు నిర్వహించారు. కోటవురట్లలో సర్పంచ్ అనీల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, బికే పల్లి గ్రామంలో సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు గ్రామాలలో ప్రజలు గ్రామంలో సమస్యలను, ఉపాధి పెండింగ్ పనులపై గ్రామ సభలు ద్వారా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని గురువారం గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించారు. నక్కపల్లి లో సర్పంచ్ జయ రత్నకుమారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉప సర్పంచ్ రాజు, ఈఓపి ఆర్డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను చర్చించి ప్రణాళిక రూపొందించారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

నర్సీపట్నంలో ఆలయం వద్ద భక్తులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు తొలిరోజు ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్ దివ్యశ్రీ చేతులు మీదుగా కలశ స్థాపన చేసి దుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, నవరాత్రులు తొమ్మిది రోజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసారని తెలిపారు. ప్రతిరోజు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అన్నప్రసాద వితరణ జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ, టీడీపీ వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తకోట, దొండపూడి, రావికమతం, మేడివాడ, చినపాచిల, గుమ్మకోపాడు, గుడ్డిప, టి.అర్జాపురం, చిలకవానిపాలెంలో అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు.కొత్తకోట గ్రామంలో శ్రీ శాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసారు.సర్పంచ్, లోవరాజు, ఉప సర్పంచ్ పి. దేవ, ఎం పిటిసి పూడి దేవ, కుంచా శంకర్, టీడీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సీలవేణి గోవిందరావు పల్లొని ప్రత్యేక పూజలు చేశారు..

అచ్యుతాపురం :అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేద పండితులతో అమ్మవారిని ప్రతిష్ఠ కార్యక్రమం చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో అమ్మవారి కి ప్రత్యేకమైన పూజలు చేశారు. మోసయ్యపేటలో నిర్మించిన గౌరీ సంఘం, కృష్ణ ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి.

పద్మనాభం : మండలంలోని దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వీకే.పాలెం, మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విజయానందపురం గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రులను పురస్కరించుకొని భారీగా విద్యుత్ దీపాలంకరణ, మండపాల అలంకరణ చేశారు.ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విఆర్ఒను సన్మానిస్తున్న కార్యదర్శి ,నాయకులు

విఆర్‌ఒ బాలాజీరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని కేపీ అగ్రహారం సచివాలయంలో పనిచేస్తున్న విఆర్ఓ బంటు బాలాజీరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన గ్రామసభలో బాలాజీరావును ఎంపీటీసీ దేవర అప్పారావు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీఆర్వో సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, వియ్యపు నాగేశ్వరరావు, దేవర ముసలి నాయుడు, విఆర్పి రమేష్ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా లవరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండల ఎంపీడీఓగా ఎ.లవరాజు గురువారం బాధ్యతల స్వీకరించారు. ఆనందపురం మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీ పై అరకులోయ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ సిహెచ్ వెంకటేష్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ, .గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -కొత్తకోట:చెత్త ద్వారా సంపదను సృష్టించ వచ్చునని రావికమతం ఎంపిపి పైలరాజు తెలిపారు. కొత్తకోట గ్రామంలోని మర్రివలస రహదారిలో సుమారు రూ. 11 లక్షల ఎ న్ ఆ ర్ ఈ జి ఎ స్ నిధులతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, గ్రామాలు పరిశు భ్రంగా ఉంటే ఎటువంటి రోగాలు దరి చేరవన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు గ్రామస్తులు సహకరించా లన్నారు. బయో వర్మీ కంపోస్ట్ యార్డును పరిశీలిం చారు. తయారీ కేంద్రం పరిసరాల్లో కడియం నుంచి ప్రత్యేకంగా రప్పించిన వివిధ రకాల మొక్కలను నాటారు.శ్మశాన వాటికలో కుళాయిలను సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, శీలం శంకరావు, ఎంపిటీసీలు పూడి దేవ, కుంచా లక్ష్మి శంకరరావు, పైల చినమ్ములు,డి. నాగ సీత పంచాయితీ కార్యదర్శి కోటేశ్వరరావు, వార్డ్ మెంబర్లు పలువురు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న ఎంపిపి

అటవీ రేంజర్ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కేడి పేట అటవీ రేంజర్‌గా కె.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరు రేంజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సహకారంతో కలప అక్రమ రవాణా నిరోధానికి కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రేంజర్‌ను డిఆర్వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణరావు, ఎరుకులమ్మ, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

శ్రీ ప్రకాష్‌లో

ఉత్సాహంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో గత రెండు రోజులుగా జరుగుతున్న సి.బి.ఎస్.ఈ క్లస్టర్ -7 (ఆంధ్రా, తెలంగాణా) ఆటలు పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. బాలికల విభాగంలో అండర్-14,17,19 విభాగాలలో జరుగుతున్న ఈ పోటీలలో 100 కి పైగా పాఠశాలల నుండి సుమారు 1200 మంది విద్యార్థినులు క్రీడాస్ఫూర్తితో నువ్వా నేనా అన్నట్లుగా ఈ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. 4వ తేదీ శుక్రవారంతో ఆటల పోటీలు ముగుస్తాయని, ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని, ముఖ్య అతిథిగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హాజరవుతున్నరని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు.

ఉత్తరాంధ్ర పోరాటాల స్ఫూర్తితో..

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

-ఉక్కు పరిరక్షణ దీక్షల్లో వక్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'ఉత్తరాంధ్ర పోరాటాలకు, విజయాలకు స్ఫూర్తి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కంటక నిర్ణయాలపై పోరాడి విజయం సాధించిన చరిత్ర ఉత్తరాంధ్రకు ఉంది. ఆ స్ఫూర్తితో విశాఖ ఉక్కును రక్షించుకుంటాం' అని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ శాసనమండలి సభ్యులు ఎంవిఎస్.శర్మ అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు తలపెట్టిన దీక్షలు గురువారానికి విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చివరి రోజుకు చేరాయి. దీక్షల్లో మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, గిరిజనులు, పెన్షనర్లు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని శర్మ ప్రారంభిస్తూ మాట్లాడారు. విశాఖ ఉక్కు అశేష త్యాగాలతో ఏర్పడిందన్నారు. పోరాటాలతో ఏజెన్సీలో బాక్సైట్ నిక్షేపాల తవ్వకాలను నిలువరించామన్నారు. ప్రాణాంతకమైన ప్రైవేటు విద్యుత్ థర్మల్ ప్లాంట్లు ఆగాయన్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌ను రక్షణ రంగంలోనూ, బిహెచ్‌పివిని బిహెచ్ఇఎల్‌లోనూ విలీనం చేయించుకున్నామని గుర్తుచేశారు. ఇలా అనేక అంశాల్లో కేంద్ర, రాష్ట్రాల మెడలు వంచి విజయాలు సాధించిన ఘనమైన పోరాట వారసత్వం ఉత్తరాంధ్ర ప్రజల సొంతమని అన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్త ప్రజల మద్దతు ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటువరం కానివ్వరాదన్నారు. ఉక్కు ఉద్యమంలో మహిళలు ముందుండటం అభినందనీయమన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. రాష్ట్రానికే కీలక పరిశ్రమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించే అవకాశం, రక్షించవలసిన బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ఉందని, కానీ వారు మోడీని గట్టిగా నిలదీయడానికి సిద్ధపడటం లేదని తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం అధ్యక్షతన జరిగిన ఈ దీక్షా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దామోదరరావు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అప్పారావు, ఐద్వా, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు బి.పద్మ, కె.వనజాక్షి, జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గు నాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మధరావు ప్రసంగించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, పి.మణి, బి.జగన్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఎపి మహిళా సమాఖ్య నాయకులు అన్నపూర్ణ, దేవుడమ్మ, అరుణ, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, కె.మణి పాల్గొన్నారు.

అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును నిస్సిగ్గుగా అమ్మాలని చూస్తుంటే స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం శోచనీయమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో మూడు రోజులపాటు ప్రజా సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ తిరుమల లడ్డూ చుట్టూ రాజకీయం నడుపుతున్న కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై శ్రద్ధ చూపకపోవడం దుర్మార్గమన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాలతో ఉక్కుపై జరుగుతున్న కుట్రలను తిప్పికొడతామన్నారు. జబర్దస్త్ ఫేమ్ సత్తిపండు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంతకుముందు దీక్షాశిబిరాన్ని ఉద్దేశించి ఎపి గొర్రెల మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటాశ్రీరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ముడిసరుకు ఇవ్వకుండా నష్టాలలోకి నెట్టేసే దుర్మార్గపు చర్యలకు కేంద్రం పూనుకుందన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గించడం, కాంట్రాక్టు ఉద్యోగులన్ని తొలగించడం, సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వంటి కుట్ర పూరిత చర్యలకు పూనుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ కోన మోహనరావు, ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డిడి.వరలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బిటి దొర, గండి నాయనబాబు, బిఎస్‌పి నాయకులు మాణిక్యాలరావు, కనిశెట్టి సురేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడారు, దీక్షలో రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, జి.నాయనబాబు, ఎస్వీ నాయుడు, శరగడం అప్పలనాయుడు, బుద్ధ రంగారావు, నరాల శెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు, కోరిబిల్లి శంకర్రావు, రైతు కూలీ సంఘం నాయకులు కోన మోహనరావు, కొమర అప్పలనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బిటి. దొర యు.సత్యవతి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డిడి.వరలక్ష్మి, పి మాణిక్యం కూర్చున్నారు. బ్రహ్మాజీ, భీశెట్టి రాము, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు,సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు, లాయర్ కనిశెట్టి సురేష్‌బాబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సభ్యులు పి. కోటేశ్వరరావు, కె. కోటేశ్వరరావు_పాల్గొన్నారు..

అనకాపల్లిలో నిర్వహించిన దీక్షల్లో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం

కార్మికవర్గాన్ని అణచివేస్తే తీవ్ర పరిణామాలు

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మిక వర్గాన్ని అణిచేందుకు ప్రయత్నాలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 1330వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం, యాజమాన్యాల వైఖరితో కార్మికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గంలో అశాంతి నెలకొందని, తద్వారా నెలకొనే పరిణామాలకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం మొండి వైఖరిని వీడి స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు.

పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, పరంధామయ్య మాట్లాడుతూ, కార్మికుల సహనాన్ని యాజమాన్యం తక్కువ అంచనా వేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి, తమకు మంచి జరుగుతుందని చూస్తున్న కార్మికులకు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు నిరాశ కల్గిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.గంగాధర్, నీలకంఠం, వి.ప్రసాద్, ఆర్.వెంకట్రావు, దత్తాత్రేయరాజు, కె.భానుమూర్తి, మధు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం ఐసిడియస్ ప్రాజెక్ట్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం విధాన్ సే సమాధాన్‌లో భాగంగా జాతీయ మహిళా కమిషన్ జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా లీగల్ సర్వీస్ ఆథారిటీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సంబందించిన హక్కులు -చట్టాలు, మహిళా సాధికారిత తదితర అంశాలపై అవగాహన కల్పించా రు. మహిళలు, పిల్లలపై నేరాలు, మానవ అక్రమ రవాణా, గృహ హింస, సమాన పనికి సమాన వేతనం, డిజిటల్ అక్షరాశ్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాలలో భార్యలను వేదించడం, గృహ హింస తదితర అంశాల వీడియో ప్రదర్శన ద్వారా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ పీడీ అనంతలక్ష్మి, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, డిఆర్‌డిఏ ఏ పిడి డైజీ, ఏరియా కో ఆర్డినేటర్ రత్న ప్రభ, ఏపీఎం చంద్రకళ, సిడీపీఓ ఉషారాణి, ఎంపిడీఓ వెంకన్నబాబు, రావికమతం ఎస్సై రఘువర్మ, లీగల్ సెల్ ప్యానల్ అడ్వకేట్ రాజాన సత్యప్రసాద్, వెలుగు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ